www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 ఆగస్టు 2023
5
ఏలూరు



నిలకడగా గోదావరి

ముంపులోనే గుండేటివాగు కాజ్‌వే

ప్రజాశక్తి - కుకునూరు

రెండు రోజులుగా క్రమంగా పెరుగుతున్న గోదావరి వరద బుధవారం నిలకడగా ఉంది. ఇప్పటికే గోదావరి వరదకు కుక్కునూరు-దాచారం మధ్య గుండేటివాగుపై కాజ్‌వే ముంపునకు గురైంది. దీంతో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, వ్యాపారులు, ప్రధానంగా మండల కేంద్రంలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ చుట్టూ 15 కిలోమీటర్ల మేర తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గోదావరి వరద నిలకడగా ఉన్న ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి వరద పోటెత్తితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఏదేమైనా వచ్చే నెలాఖరు వరకు ముంపు మండలాలకు వరదగండం తప్పేలా లేదని ఆందోళన చెందుతున్నారు.



జంగారెడ్డిగూడెం సభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

నిర్వాసితుల సమస్యే అత్యంత ప్రధానం

ప్రాణాలు అరచేత పట్టుకుని నిర్వాసితులు జీవనం

ప్రశ్నార్థకంగా డ్యామ్ భద్రత

పోలవరంలో మొదటి ముద్దాయి మోడీ ప్రభుత్వమే

సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

పరిహారం ఇస్తేనే 'పోలవరం' పూర్తి

ప్రజాశక్తి - ఏలూరుప్రతినిధి, అర్బన్

పోలవరం ప్రాజెక్టులో సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించినప్పుడే ప్రాజెక్టు పూర్తయినట్లని, నిర్వాసితులకు పరిహారం అందించకుండా గోదావరిలో ముంచేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడం దారుణమని రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు తెలిపారు. 'రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి' అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చేపట్టిన బస్సుయాత్ర బుధవారం ఏలూరు చేరుకుంది. స్థానిక ఆశ్రం ఆసుపత్రి వద్ద బస్సుయాత్రకు ఆ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక టుబాకో మర్చంట్స్ కళ్యాణ మండపంలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, టిడిపి నేత, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ, ప్రత్యేకహోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్‌తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. సమావేశానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అధ్యక్షత వహించారు. తొలుత సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య నేతలను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు ఇప్పటి వరకూ 22 శాతం మాత్రమే పరిహారం అందించారన్నారు. డ్యామ్ మాత్రం 70 శాతం పూర్తి చేశారన్నారు. సిఎం జగన్ కేంద్రంపై ఒత్తిడి చేసి నిధులు రాబట్టకుండా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రాజెక్టు డ్యామ్ భద్రత ప్రమాదంలో పడిందని, ప్రపంచస్థాయి నిపుణులతో తనిఖీ చేయించి నష్టపరిహారాన్ని కాంట్రాక్టర్ల వద్ద వసూలు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్వీర్యంలో తొలిముద్దాయి మోడీ ప్రభుత్వమే అని విమర్శించారు. మోడీ అరచేతిలో వైకుంఠం చూపిస్తూ పనికిమాలిన ప్రధానిగా ఉన్నందుకు ప్రతి భారతీయుడూ సిగ్గుపడాలన్నారు. జగన్‌ను మోడీ కాపాడుతున్నారని, ఆ ధైర్యంతోనే ఇక్కడ వైసిపి నాయకులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల కోసం ఢిల్లీకి అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలన్నారు. నిర్వాసితులకు అండగా ఉండి అందరం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాజన్న రాజ్యం తెస్తానని మోడీ రాజ్యం తీసుకొచ్చిన ఘనుడు జగన్ అని ఎద్దేవా చేశారు. 41.15, 45.75 లెక్కలు ప్రాజెక్టు ఎత్తుకు సంబంధించినవే కాదని, నిర్వాసితుల పరిహారానికి సంబంధించినవని తెలిపారు. ప్రస్తుతం ముంచుతున్నవి గోదావరి వరదలు కాదని, ప్రాజెక్టు నిర్మాణంతో వస్తున్న వరదలేనని అన్నారు. నిర్వాసితుల భూములకు ఇస్తామన్న రూ.ఐదు లక్షల పరిహారంలో ఐదుపైసలుగానీ, పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షల్లో పదిపైసలుగాని జగన్ ఇవ్వలేదన్నారు. వరదలొస్తే రూ.పది వేలు పరిహారం ఇవ్వకుండా రూ.రెండు వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు నిర్వాసితులకు అండగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోడీని నిధులు అడగడానికి భయపడుతుందన్నారు. కేంద్రం చెబుతున్న విద్యుత్, చెత్త వంటి అన్ని పన్నులు వేస్తున్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఇచ్చే ఉచిత విద్యుత్ కూడా ఇవ్వడం లేదన్నారు. ఇదేనా అభివృద్ధి అని ప్రశ్నించారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసి నిర్వాసితులను గోదావరిలో ముంచారన్నారు. నిర్వాసితుల త్యాగఫలితమే పోలవరం ప్రాజెక్టు అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం రూ.15 వేల కోట్లు కేటాయిస్తే నాలుగేళ్లలో నిర్వాసితులకు నష్టపరిహారం



ఏలూరులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

చెల్లించడంతోపాటు, ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యి రాష్ట్రం సస్యశ్యామలమయ్యేదన్నారు. పోలవరం నిర్వాసితులు లక్షా ఆరు వేల కుటుంబాలుంటే కేవలం 20 వేల కుటుంబాలకు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తామనడం దుర్మార్గమన్నారు. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తూ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతికి జగన్, పోలవరం ప్రాజెక్టుకు మోడీ శనిలా దాపురించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం వరదలు వచ్చినప్పుడల్లా గిరిజనులు కొండలు, గుట్టలపై తల దాచుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి, ప్రాజెక్టును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుతో భవిష్యత్తులో కరువురహిత రాష్ట్రంగా ఎపి ఉంటుందన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తి చేస్తే వైసిపి ప్రభుత్వం కేవలం నాలుగు శాతం మాత్రమే పూర్తి చేసిందన్నారు. కనీసం 2030 నాటికి పూర్తవుతుందో లేదోనని రైతాంగం, ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎప్పటి పనులు అప్పుడు పూర్తి చేయకుండా కాంట్రాక్టు ఏజెన్సీలను ఒక కలం పోటుతో రద్దు చేయడం పోలవరం జాప్యానికి ప్రధాన కారణమన్నారు. సామాజిక విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రాజెక్టు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. నీటికి రాజకీయరంగు పులమాల్సిన అవసరం లేదన్నారు. నీటితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తే అన్ని రంగాలకూ ఉపయోగమని, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సర్వం త్యాగం చేసిన నిర్వాసితులే తొలి లబ్ధిదారులుగా ఉండాలన్నారు. మోడీ ప్రభుత్వానికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జగన్ అనాలోచిత విధానాల ఫలితంగా మట్టి రాతి కట్టడం, డ్యామ్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. రివర్స్ టెండరింగ్ పేరుతో కాంట్రాక్టర్‌ను మార్చి రూ.235 కోట్లు ఆదా చేశానన్న సిఎం జగన్ రూ.2335 కోట్లు అదనంగా ప్రతిపాదించి కాంట్రాక్టర్‌ను నియమించి రాష్ట్ర ఖజానాకు తూట్లు పొడిచారన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదిత డిజైన్ 45.72 నుండి 41.15 కుదించి నిర్మించడం సరికాదన్నారు. రాజకీయ నాయకులు ఐక్యంగా పోరాడితేనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ నిర్వాసితులను పూర్తిస్థాయిలో ఎప్పుడు ఖాళీ చేయిస్తే అప్పటివరకూ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలన్నారు. బిజెపితో అంటకాగే పార్టీలన్నింటిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం పోరాడుతున్న అన్ని పార్టీలకూ తమ మద్దతు ఉంటుందన్నారు. జనసేన నాయకులు రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడానికి ముఖ్యమంత్రి జగన్ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యలపై నిలదీయలేని ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం మన దౌర్భాగ్యమన్నారు. వైసిపి, బిజెపి మినహా అన్నిపార్టీల నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ వందన సమర్పణ చేశారు. తొలుత ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.పెంచలయ్య, ఏలూరు ఏరియా కార్యదర్శి తమ్మా విశ్వేశ్వరరావు ఇతర కళాకారులు ఆలపించిన గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకుడు డిఎన్‌విడి ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడీ, జగన్‌లను తరిమికొడదాం

జంగారెడ్డిగూడెం:రాష్ట్రంలో జగన్, దేశంలో మోడీలను తరిమికొట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. 'రాష్ట్రాన్ని రక్షించండి – దేశాన్ని కాపాడండి' నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర బుధవారం సాయంత్రం జంగారెడ్డిగూడెం చేరింది. ఈ సందర్భంగా జెపి సెంటర్‌లో జరిగిన బహిరంగసభకు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ 922 రోజులుగా 33 కార్మిక సంఘాలు పోరాటం చేస్తున్నా ప్రధాని మోడీ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ దుర్మార్గ విధానాలతో అస్తవ్యస్త పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టిన నాటి నుండి తన రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టి ప్రశ్నించే గొంతుకలను జిఒ నెం.1 అడ్డుపెట్టుకుని అణిచేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల ముసుగులో అభివృద్ధిని నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉందని, జగన్ అనాలోచిత విధానాలకు గుంతలు పడిన రహదారులే నిదర్శనమని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో గిరిజనులను నిండా ముంచారన్నారు. కేంద్రం సహకరిస్తేనే తాను పోలవరం నిర్వాసితులకు పరిహారం అందిస్తానని చెప్పడం తన అసమర్ధతకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో జగన్, కేంద్రంలో మోడీలను రాబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బస్సు యాత్ర ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 8న తిరుపతిలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ సిఎం జగన్ తన స్వార్ధ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావుల రవీంద్రనాథ్ మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక వర్గానికి తీరని ద్రోహం తలపెట్టారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సభకు అధ్యక్షత వహించిన కృష్ణ చైతన్య మాట్లాడారు. సభలో నేతలు జయలక్ష్మి, పరుచూరి రాజేంద్ర, నక్కి లెనిన్‌బాబు, పెంచలయ్య, చంద్రనాయక్, ఆర్.పిచ్చయ్య, మహంకాళి సుబ్బారావు, బండి వెంకటేశ్వరరావు, దారయ్య, జెవి.రమణరాజు, రాము, జమ్మి శ్రీనివాసరావు, టివిఎస్.రాజు, గోలిమే బాలయేసు, మైసాక్షి వెంకటాచారి, గురవయ్య పాల్గొన్నారు.

నేడు జిల్లాలోకి లోకేష్ పాదయాత్ర



నూజివీడు మండలం మీర్జాపురంలో ప్రవేశం

మూడు రోజులు నూజివీడు నియోజకవర్గంలోనే యాత్ర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలోకి గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రవేశించనుంది. లోకేష్ పర్యటనకు సంబంధించి షెడ్యూల్‌ను ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. 24వ తేదీ గురువారం సాయంత్రం మీర్జాపురం గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి గ్రామ శివార్లలో ఎంఎన్‌కె రహదారి పక్కన రాత్రి బస చేయనున్నారు. 25వ తేదీ శుక్రవారం ఉదయం సమీపంలోని పామాయిల్ తోటలో మామిడి రైతులతో సమావేశం జరగనుంది. అనంతరం గొల్లపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభమై మోర్సపూడి, తక్కులూరు గ్రామాల మీదుగా సాగనుంది. మధ్యాహ్నం భోజనం నూజివీడు సరస్వతీదేవి ఆలయ సమీపంలో ఏర్పాటు చేశారు. అనంతరం నూజివీడు పట్టణంలో చిన్న గాంధీబొమ్మ సెంటర్, పొట్టి శ్రీరాములు బొమ్మసెంటర్, పెద్దగాంధీ బొమ్మసెంటర్, పోస్టాఫీస్ రోడ్డు, టిటిడి కల్యాణ మండపం మీదుగా ఎంప్లాయీస్ కాలనీ నుంచి మూడుపల్లి తాతయ్య బాబు జూనియర్ కాలేజీ, వెంచర్, బైపాస్‌రోడ్డు మీదుగా పోతిరెడ్డిపల్లి గ్రామం వరకూ సాగి రాత్రికి అక్కడ బస చేయనున్నారు. 26వ తేదీ శనివారం ఉదయం పోతిరెడ్డిపల్లి గ్రామం నుంచి సింహాద్రిపురం, ముసునూరు మీదుగా వలసపల్లి గ్రామం వరకూ సాగనుంది. మధ్యాహ్న భోజన విరామం అనంతరం వలసపల్లి నుంచి యాత్ర ప్రారంభం కానుంది. లోకేష్ పాదయాత్రకు సంబంధించి టిడిపి నాయకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. నూజివీడు నియోజకవర్గ అనంతరం చింతలపూడి నియోజకవర్గంలోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశించనుంది. చింతలపూడిలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన షెడ్యూల్ వివరాలు రావాల్సి ఉంది.

ప్రజలపై భారాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన

30, 31 తేదీల్లో ఇంటింటా ప్రచారం, సంతకాల సేకరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ ఈనెల 30, 31 తేదీల్లో సిపిఎం చేపడుతున్న ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యాలయంలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎ.రవి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజలు కొనుగోలు చేసే నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు భారీగా పెంచిఅంబానీ ఆదానీలకు దేశ సంపదను దోచిపెడుతుందని కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రయివేటీకరణ విధానాల వల్ల దేశంలో చిన్నపరిశ్రమలు లక్షల సంఖ్యలో మూతపడ్డాయని తద్వారా దేశంలోని 80 శాతంగా ఉన్న యువత ఉద్యోగాలు కోల్పోయి రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే దేశంలోని విద్యుత్‌రంగాన్ని అదానికి కట్టబెట్టారని దీనిద్వారా ప్రజలందరిపై విద్యుత్‌భారాల మోపి ప్రజల సొమ్మును కార్పొరేటర్లకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని పేర్కొన్నారు. ఇంతజరుగుతున్నా సిఎం జగన్ నోరుమెదపకపోవడం సిగ్గుచేటని, రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం సిఎం జగన్ అఖిలపక్షాలను కలుపుకుని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, వైసిపి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే సిపిఎం ఆధ్వర్యంలో అనేకమార్లు దేశవ్యాప్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన కార్యక్రమాలు చేపట్టామని, ప్రభుత్వం పెంచిన ధరలు, మోపిన భారాలు తగ్గించకుండా దున్నపోతు మీద వాన కురిసినట్లు వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం, సంతకాలు సేకరణతో ప్రజల మద్దతు కూడగడతామని తెలిపారు. వచ్చేనెల ఒకటి, రెండు తేదీల్లో గ్రామ సచివాలయాల వద్ద ధర్నాలు చేస్తామని, అప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే ప్రజలందరినీ ఐక్యంచేసి ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, కమిటీ సభ్యులు జి.సూర్యకిరణ్, ఎ.ప్రభాకర్‌రావు, జి.రాంబాబు, బి.రాంబాబు, యాగంటి సీత, పటాన్ మస్తాన్, కె.సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్నసిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

స్కీమ్ వర్కర్లకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు మండల కమిటీ సమావేశం సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో కుంజ నాగలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు సేవ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరుస్తూ, తల్లీబిడ్డ సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం చిన్నచూపు చూస్తూ స్కీం వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీలకు నాసిరకం యూనిఫారాలు ఇస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.300 ఇస్తుంటే కనీసం 100 రూపాయలు కలిపి రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని, దీన్ని ఆసరాగా తీసుకుని, అధికారులు కమిషన్లకు కక్కుర్తి పడుతూ వంద రూపాయల విలువైన చీరలు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. యానిమేటర్లకు 5జి ఫోన్‌లు ఇవ్వకుండా ఎవరి ఫోన్‌లో వాళ్లని వర్క్ చేయాలని ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు ఎప్పటికి ఒకే రకమైన నాణ్యత కల్గిన యూనిఫారాలు ఇవ్వాలని, యానిమేటర్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి, 5జి ఫోన్లు ఇవ్వాలని, ప్రతీనెల మొదటి తేదీన గౌరవ వేతనాలు ఇవ్వాలని, బకాయి వేతనాలు విడుదల చేయాలని లేదంటే ఐక్య పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కమిటీ నాయకులు మేడవరపు రమాదేవి, కుర్ర గ్రేసి, కణితి మంగ, వర్స మంగ, బురం శ్రావణి, దుర్గమ్మ, అమ్మాజి, ఆదిలక్ష్మి, రత్నకుమారి, నాగదేవి, సౌజన్య పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల బకాయి వేతనాలు విడుదల చేయాలి




వినతిని అందిస్తున్న నాయకులు, ఉపాధి కూలీలు

దెందులూరు: ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్రదర్యాప్తు చేసి, అవినీతికి పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎఒకు వినతిని అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ చట్టంలో తీసుకొచ్చిన కొత్తమార్పుల వల్ల కూలీలు, మేట్లు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల నుండి ఐదు వారాల వేతనాలు పడక కూలీలు అప్పుల పాలయ్యారని తెలిపారు. కూలీలకు ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇవ్వాల్సిన వేతనం కనీసం రూ.272 ఇవ్వాలని డిమాండ్ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు చేస్తున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలన్నారు. మేట్ల వ్యవస్థను పునరుద్ధరించాలని కోరారు. పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు పి.ఆనందరావు, జాన్‌రాజు, మణి, లక్ష్మి, నాగేంద్ర పాల్గొన్నారు.

గిరిజనుల భూ పోరాటానికి సిపిఎం మద్దతు

టి.నరసాపురం: బండివారిగూడెం రెవెన్యూ పరిధిలోని మర్రిగూడెం గ్రామపంచాయతీలోని ఆరు ఆదివాసీ గ్రామాల గిరిజనులు, రైతుకూలి సంఘం చేస్తున్న భూ పోరాటాలకు సిపిఎం మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి తుమ్మల సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల కమిటీ ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆరు గ్రామాల గిరిజనులు 1992 భూ పోరాటాల ద్వారా భూములు సాధించుకుని సాగు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని, ఆన్‌లైన్ చేయడం, అమ్మడం వంటివి జరిగాయన్నారు. దీనిపై అనేకసార్లు తహశీల్దార్, ఆర్‌డిఒ, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు స్పందనలో వినతులు ఇచ్చామన్నారు. హైకోర్టులో కూడా పిటిషన్ వేశారన్నారు. సంఘం నాయకత్వంలో సమిష్టి పంటల సాగు చేయాలని ఆదివాసీలు సమిష్టిగా పత్తిసాగు చేస్తున్నారని తెలిపారు. ఈ క్రమంలో భూములు ఆక్రమంగా కొన్నవారు గ్రామ ప్రజలకు తెలియకుండా పత్తిపంటను ధ్వంసం చేశారని, పత్తిపంట నష్టం చేసిన భూస్వాములపై కేసు నమోదు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు.



అధికారులను సన్మానిస్తున్న పొగాకు రైతు సంఘం నేతలు

ముగిసిన పొగాకు కొనుగోళ్లు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వేలం కేంద్రం–18లో ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కొనుగోలుదారులను, పొగాకు అధికారులను, సిబ్బందిని పొగాకు రైతు సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా గుంటూరు కేంద్ర పొగాకు బోర్డు కార్యాలయ ఉత్పత్తి మేనేజర్ డాక్టర్ కృష్ణశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు అమ్మకాలపై రైతులు సంతృప్తిగా ఉన్నారన్నారు. పొగాకు రైతుల అభివృద్ధికి పొగాకు బోర్డు ఎల్లవేళలా కృషి చేస్తుందన్నారు. రాబోయే సీజన్ ఇంతకంటే మంచి మార్కెట్ రావాలని రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. రాజమండ్రి రీజినల్ మేనేజర్ ఆదిశేషయ్య మాట్లాడుతూ పొగాకు వేలం కేంద్రం–18లో 12.72 మిలియన్ కేజీల అమ్మకాలు జరిగాయని, 246.36 సరాసరి ధరతో రూ.313 కోట్ల 55 లక్షల విలువైన పొగాకు అమ్మకం జరిగిందన్నారు. ఈ ఏడాది వర్జీనియా పొగాకు ధరలను చూసి పోటీపడి కౌలు ధరలు పెంచుకోవద్దని సూచించారు. పొగాకుబోర్డు నిర్దేశించిన కోటా మాత్రమే పండిస్తే మార్కెట్ ఎల్లప్పుడూ ఇలాగే ఉంటుందని తెలిపారు. రైతులందరూ క్రమశిక్షణతో నాణ్యత గల పొగాకు పండించాలని కోరారు. వర్జీనియా పొగాకు రైతు సంఘం అధ్యక్షులు పరిమి రాంబాబు, ఉపాధ్యక్షులు కూచిపూడి రమేష్, ఘంటసాల గాంధీ, అల్లూరి సోమేశ్వరరావు, గద్దే సోమేశ్వరరావు, కూచిపూడి రమేష్, ఎం.రవివర్మ, మురళీ, పోలిన సుబ్రహ్మణ్యం, కె.శ్రీను, వై.శ్రీనివాసరావు, మునీంద్ర, రైతులు పాల్గొన్నారు.

గిరిజనుల సాగుభూములకు పట్టాలివ్వాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఐటిడిఎ వద్ద ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



ఐటిడిఎ పిఒకు సమస్యలు వివరిస్తున్న నాయకులు, గిరిజనులు

గిరిజనులు సాగుచేసుకుంటున్న ఎల్‌టిఆర్, 1/70, పోడుభూములకు పట్టాలివ్వాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఐటిడిఎ ఎదుట ధర్నా నిర్వహించారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ తరతరాలుగా గిరిజనులు సాగుచేస్తున్న ఎల్‌టిఆర్, 1/70, పోడు భూములకు పట్టాలివ్వాలని అనేక ఆందోళనలు చేసినప్పటికీ అధికారులు స్పందించడం లేదన్నారు. ఏజెన్సీలోని వేలాది ఎకరాల్లో గిరిజనులు తరతరాలుగా వ్యవసాయం చేస్తున్నప్పటికీ వారి పేర్లను అడంగళ్‌లో నమోదు చేయడం లేదన్నారు. కౌలుకు చేస్తున్న గిరిజనేతరుల పేర్లను మాత్రం నమోదు చేయడం దుర్మార్గమన్నారు. గిరిజనేతరులకు ప్రొటెక్షన్ ఆర్డర్ ఇచ్చే అధికారం ఆర్‌డిఒకు లేదని చెప్పిన వారే అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. మర్లగూడెంలో గిరిజనులు సాగుచేస్తున్న భూములకు గిరిజనేతరులకు అనుకూలంగా ఆర్‌డిఒ ప్రొటెక్షన్ ఇవ్వడం వాటి ఆధారంగా గిరిజనేతరులు రౌడీలను వెంటపెట్టుకుని పోలీసుల సమక్షంలో గిరిజనులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. జీలుగుమిల్లి తహశీల్దార్ గిరిజనేతరులకు తప్పుడు ప్రొటెక్షన్ ఇస్తున్నారన్నారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ, గిరిజన చట్టాలకు లోబడి గిరిజనేతరుల కౌలు వ్యవసాయం ఉందని, పోలవరం నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ భూములను కొందరు వందలాది ఎకరాలకు తక్కువ కౌలుకు తీసుకుని ఆదివాసీలను మోసం చేస్తున్నారన్నారు. దొరమామిడి, కోటనాగవరం, నిమ్మలగూడెం ప్రాంతంలో ఆర్‌అండ్‌ఆర్ భూములు తక్కువ కౌలుతో గిరిజనేతరులు వ్యవసాయం చేస్తున్నారన్నారు. వందల ఎకరాల్లో ఒక్కరే వ్యవసాయం చేస్తున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో భూ వివాదాలను అరికట్టేందుకు ఇరుపక్షాలతో రికార్డ్ పరిశీలన చేయాలన్నారు. తక్షణం గ్రామసభలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రామసభలు నిర్వహించి హక్కు పట్టాలు కోసం రోడ్ మ్యాప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజకు వినతపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో పర్యటించి గిరిజనులకు న్యాయం చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం దుర్గారావు, బొరగం భూ చంద్రం, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి, గుడెల్లి వెంకట్రావు, చంద్రు బుల్లెమ్మ, కోర్స జలపాలు, వెట్టి వీరయ్య పాల్గొన్నారు.

ప్రతిభకు గోల్డెన్, బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ 2022-2023లో స్థానిక ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కి చెందిన విద్యార్థులు అత్యధిక ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయిలో టాపర్స్‌గా నిలిచారని ప్రిన్సిపల్ లక్ష్మి సరోజారెడ్డి తెలిపారు. బుధవారం ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ 2022-2023లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మి సరోజారెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన టి.శరణ్య డ్రాయింగ్ ఒలంపియాడ్‌లో స్టేట్ థర్డ్ సాధించి మెడల్, రూ.1,200, కె.ప్రతిభా సరోజ్ రెడ్డి, ఇంగ్లీషు ఒలంపియాడ్‌లో స్టేట్ ఫోర్త్ సాధించి మెడల్, రూ.1,000, ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో కె.ప్రజ్ఞత సరోజ్ రెడ్డి స్టేట్ ఫోర్త్ సాధించి మెడల్, రూ.700 నగదు, అవార్డును గెలుచుకున్నట్లు తెలిపారు.


అవార్డులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్, సిబ్బంది

గణితంలో ఎక్సలెన్స్ అవార్డులను దుర్గశ్రీ, డింపుల్ ప్రణీత్, ధీరజ్ గెలుచుకున్నారని తెలిపారు. డ్రాయింగ్‌లో హర్షిత్ హంసవర్ధిని ఎక్సలెన్స్ అవార్డులను దక్కించుకున్నారన్నారు. ఈ క్రమంలో ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు నేషనల్ లెవెల్ గోల్డెన్ స్కూల్ అవార్డును ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ వారు బహూకరించారని తెలిపారు. అలాగే బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డు అందించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభలో నిర్వహించిన అభినందన సభలో విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, సుభాష్ రెడ్డి, సింధుషారెడ్డి, ప్రిన్సిపల్ సరోజా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి, ఎయిడ్స్‌ను తరిమికొట్టాలి

'రెడ్ రన్' కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చింతలపూడి

హెచ్ఐవి, ఎయిడ్స్‌ని సమాజం నుంచి తరిమికొట్టాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై 'రెడ్ రన్' అనే కార్యక్రమం ద్వారా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యువతకి హెచ్ఐవి గురించి అవగాహన కల్పించారు. హెచ్ఐవిని దేశం నుంచి తరిమికొట్టాలని, అవిధంగా సమాజాన్ని రక్షించాలని ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జీవన, మౌనిక పాల్గొన్నారు.

మేలైన దిగుబడులకు సూచనలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేలైన వ్యవసాయ పద్ధతులతో కూడిన పొలంబడి వ్యవసాయ క్షేత్రంలో అధ్యక్షతన వరి పైరుకు ఆకు ముడత సోకిందని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వై.రామకృష్ణ తెలిపారు. దీని నివారణకు ముందస్తుగానే రైతులు ఎకరం ఒక్కింటికి మూడు లీటర్ల అగ్నిఅస్త్రం ద్రావణాన్ని పిచికారి చేయడం ద్వారా వాటి ఉధృతిని తగ్గించవచ్చని సంచాలకులు తెలిపారు. భీమడోలులో నిర్వహిస్తున్న పొలంబడి క్షేత్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మమేకమయ్యారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరి పంటలో ఎరువుల యాజమాన్యం మేలైన వ్యవసాయ పద్ధతుల వల్ల కలిగే ప్రయోజనాలు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ మొత్తంలో నాణ్యమైన దిగుబడి సాధించే విధానం, ప్రకృతి వ్యవసాయం-ప్రయోజనాలు ఇతర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు, ఏలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు కె.సుబ్బారావు, పి.ఉషారాణి కుమారితో పాటు వ్యవసాయ అధికారి ఉషారాణి, గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని శ్రీనివాసపురంలోని ఎలిమెంటరీ, హైస్కూల్‌లో ఏలూరు స్మార్ట్ సిటీ లైన్స్ క్లబ్, బ్రేస్ ఇండియా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థులకు రూ.15వేల విలువైన నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. బ్రేస్ ఇండియా సంస్థ అధ్యక్షులు ఆంజలో డిఫ్ల ద్వారా 100 మంది 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల పేడ్స్, జామెంట్రీ బాక్స్, పెన్నులు పరీక్షలకు ముందు అందజేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చాట్రాయి

యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు తెలిపారు. టిడిపి మండల సమావేశం బుధవారం చాట్రాయిలోని నూనె మిల్లు ఆవరణలో నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు సమావేశానికి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర 24, 25 తేదీల్లో నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లో నిర్వహించబడుతుందన్నారు. ప్రతి కార్యకర్త పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యువగళం పాదయాత్ర ఆపాలని అధికార పార్టీ నాయకులు ఎన్ని ఆవాంతరాలు సృష్టించినా, అడ్డంకులను ఎదుర్కొంటూ పాదయాత్ర ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొట్లు రామచంద్రరావు, ఎర్రోజు రాంప్రసాద్, పలాని దుర్గారావు పాల్గొన్నారు.

ముసునూరు : నారా లోకేష్ యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి మండల ప్రధానకార్యదర్శి కందుల పిచ్చియ్య కార్యకర్తలను, నాయకులను, ప్రజలను కోరారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో మండలంలోని 16 గ్రామాల టిడిపి కార్యకర్త సమావేశం నిర్వహించారు. పాదయాత్రకు ముసునూరు మండలంలో స్వాగతం పలకాలన్నారు. నూజివీడు నుండి పోతిరెడ్డిపల్లి, సింహాద్రిపురం, చింతలపల్లి, ముసునూరు, వలసపల్లి మీదగా లింగపాలెం మండలంలోని ధర్మాజీగూడెం గ్రామానికి చేరుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడిపిటిసి మాజీ సభ్యులు చిలుకూరి వెంకటేశ్వరరావు, నాయకులు కూచిపూడి దేవేంద్ర, దేవినేని ప్రసాద్, తుమ్మల లక్ష్మణరావు, సూర్యదేవర శ్రీనివాసరావు, గద్దల మోహన్‌రావు, పాకనాటి సీతారామాంజనేయులు, తల్లిబోయిన సత్యనారాయణ, వేంపటి సత్యనారాయణ, ఇస్మాక్, రావుల ప్రతాప్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు పరిష్కరించడం అభినందనీయం

ప్రజాశక్తి - కలిదిండి

ప్రజాసమస్యల పరిష్కారంలో భాగస్వాములవ్వడం అభినందనీయమని మాజీ ఎంపిపి కామినేని శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో దాత ఎంపిపి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి పుట్టినరోజు సందర్భంగా మండలానికి ఉచిత మంచినీటి సరఫరాకై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్‌ను ఆయన ప్రారంభించారు. వల్లభనేని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగీరాజు, మాజీ జెడిపిటిసి నున్నా రమాదేవి, మాజీ ఎంపిపి చెన్నంశెట్టి మురళీకృష్ణ, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు, కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ యార్లగడ్డ రవికుమార్, వెంకటాపురం, ఎన్ఆర్ పి.అగ్రహారం సర్పంచులు గూడవల్లి శ్రీనివాసరావు, పరసా వెంకట సాంబ, సిటిపాదుల సంఘం మాజీ అధ్యక్షులు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి వెంకట సత్యనారాయణ, నాయకులు కేసిరెడ్డి బలరాం, వల్లభనేని సత్యనారాయణ, కురెళ్ల ఏడుకొండలు, రెడ్డి శ్రీనివాస చక్రవర్తి పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను విజయవంతం చేయాలని ఉంగుటూరు నియోజకవర్గ జనసేన ఇంఛార్జి పత్సమట్ల ధర్మరాజు కోరారు. బుధవారం ఉంగుటూరు జనసేన కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలలో భాగంగా సెప్టెంబర్ ఒకటవ తేదీన మెగా రక్తదాన శిబిరం, మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో వచ్చే పుట్టినరోజుకి చేపట్టబోయే సేవా కార్యక్రమాలపై చర్చించారు. సెప్టెంబర్ ఒకటిన గోపీనాథపట్నంలో శ్రీలక్ష్మీ నారాయణ అన్నదాన సత్రంలో జరగబోయే మెగా మెడికల్ క్యాంప్‌లో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు, డెంటల్, ముక్కు, చెవి, గొంతు, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, స్త్రీ వ్యాధి నిపుణులు, చర్మ వ్యాధుల నిపుణులు, కంటి ఉచిత పరీక్షలు, ఆపరేషన్, శస్త్ర చికిత్స నిపుణులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఉంగుటూరు నియోజకవర్గ జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

కాపు అభ్యున్నతికి కృషి

ముదినేపల్లి : దక్షిణ భారత కాపు అసోసియేషన్ ప్రాంతీయ కమిటీలను ఏర్పాటు చేసి, కాపు సామాజిక వర్గ అభ్యున్నతికి కృషి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు అసోసియేషన్ ఏపి కాపు అసోసియేషన్ కమిటీ కార్యదర్శి విఎన్ గోపాల్ తెలిపారు. ముదినేపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ అందరికీ సమాన న్యాయం అనేది అసోసియేషన్ ధ్యేయమన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో అసోసియేషన్ కమిటీలను ఏర్పాటు చేసి, కాపు సామాజిక వర్గ యువతకు కూడా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై దృష్టి పెడతామన్నారు. ప్రతిభ కలిగిన యువతను గుర్తించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలను అసోసియేషన్ ప్రత్యేకంగా పరిశీలిస్తుందని తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక్కో సంవత్సరం 500 మంది యువకులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందజేసి స్వయం ఉపాధి కల్పించాలన్న అవకాశం ఉందని గోపాల్ తెలియజేశారు.

అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు : విద్యుత్ శాఖ

ఏలూరు : విద్యుత్ వినియోగదారులకు కరెంటు బిల్లులు చెల్లింపు నిమిత్తము ఆన్ లైన్‌లో చెల్లించడానికి వివిధ రకాల ఆన్‌లైన్ సేవలను విద్యుత్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆపరేషన్ సర్కిల్ ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు క్యూలైన్‌లో నిలబడి విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా ఉండేందుకు ఆన్‌లైన్ సేవలను అందరికీ సులభ పద్ధతిలో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ క్రింది తెలిపిన ఆన్‌లైన్ సేవలు. గూగుల్ పే, ఫోన్ పే, పేటియం, ఎపిఇపిడిసిఎల్ వెబ్‌సైట్, ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్, ఆటో పే టచ్ బ్యాంక్ అకౌంట్స్, పే యు, మీ సేవ, సిఎస్‌సి సెంటర్స్ 10, ఎనీ టైం పేమెంట్ సెంటర్స్, బిల్ డెస్క్, ఇన్ స్టా పే, పే మెంట్ టచ్, ఎలక్ట్రిసిటి క్యూఆర్ కోడ్ ఆన్ సిసి బిల్స్ అందరికీ అందుబాటులో ఉన్నాయి. తమ కరెంటు బిల్లులను సకాలంలో ఆన్‌లైన్ విధానంలో చెల్లించి, విద్యుత్ శాఖ వారికి సహకరించాలని ఆయన కోరారు.


ఆగిరిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచి, ఆశాలు

'పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన దోమలను నివారించటంతో పాటు, పలు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని ఆగిరిపల్లి సర్పంచి చవటపల్లి లక్ష్మీ విక్టర్‌బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆమె దోమల నివారణకు ఉపయోగించే నూతన ఫాగింగ్ మిషన్ ప్రారంభించారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌లో భాగంగా ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి జె.జగన్మోహనరావు, సబ్‌యూనిట్ అధికారి జె.యలమంద, ఇఒపిఆర్‌డి బి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు కె.సంగమయ్య, సిహెచ్.పుల్లారావు, గ్రామ ప్రముఖులు విక్టర్‌బాబు, ఆశావర్కర్స్ పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మంచి పౌర సమాజం

ముదినేపల్లి : పోలీస్ వ్యవస్థలో ప్రజలు భాగస్వామ్యమైన రోజు మంచి పౌర సమాజాన్ని నిర్మించవచ్చని ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు తెలిపారు. వార్షిక తనిఖీలో భాగంగా బుధవారం ఆయన ముదినేపల్లి పోలీస్‌స్టేషన్ సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యమైన నాడే నేర శాతాన్ని అదుపు చేయవచ్చున్నారు. మండలంలో చోరీ కేసుల్లో రికవరీ 90 శాతం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ కృష్ణకుమార్, ఎస్ఐ డి.వెంకటకుమార్ పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్ : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 9 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించామని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సుమారు 30 మంది తలసేమియా చిన్నారులు రెడ్ క్రాస్ తలసేమియా భవనంలో కొత్తగా నమోదు అవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా కుక్కునూరు, వేలూరుపాడు వంటి ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటున్నారన్నారు. బుధవారం తలసేమియా వ్యాధి చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు మానవత జిల్లా విద్యా కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు ఉచిత భోజనం, లైన్స్‌క్లబ్ సభ్యురాలు కె.పద్మావతి పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్ని, డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాదరావు, మానవత జిల్లా విద్యా కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా కందుకూరి ప్రకాశం పంతులు జయంతి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధి టివి.ఉమామహేశ్వరరావు, గ్రంథ పాలకులు, ఇతర ప్రముఖులతో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు, టంగుటూరి ప్రకాశం పంతులు, గిడుగు రామ్మూర్తి జీవిత విశేషాలు, వారు ఆశించిన లక్ష్యసాధనకు చేసిన కృషి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, గ్రంథాలయ సందర్శకులు పాల్గొన్నారు.


చింతలపూడిలో నివాళులర్పిస్తున్న ఎంపిపి రాంబాబు

చింతలపూడి : స్వాతంత్ర సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులని చింతలపూడి ఎంపిపి రాంబాబు తెలిపారు. నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయ్యారని ఆయన తెలిపారు. చింతలపూడిలో బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం 151వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1940, 50 దశకాల్లో ఆంధ్ర రాజకీయాల్లో, ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకరని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : ఆంధ్రకేసరి లాంటి మహనీయులులా ఎదగాలంటే ప్రతిఒక్క విద్యార్థి మంచిగా చదువుకోవాలని ముసునూరు హాస్టల్ వార్డెన్ షేక్ నజీర్ తెలిపారు. బుధవారం మండలంలోని ముసునూరులో వెనుకబడిన తరగతుల బాలుర హాస్టల్‌లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పుట్టినరోజు వేడుకలు విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలి


వ్యవసాయ కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి - లింగపాలెం

పేదల, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పేదలు, కూలీలు దళితులు 'భూములు పంచండి పేదలను ఆదుకోండి', 'అసైన్డ్ చట్టాన్ని అమలు చేయాలి - దళితులకు న్యాయం చేయాలని' నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని పేదలకు, భూస్వాముల నుంచి అన్యాక్రాంతమైన పేదల భూములను స్వాధీనం చేసుకొని, పేదలకు పంచాలన్నారు. ఇప్పటికే మండలంలో వేలాది ఎకరాల భూములు భూస్వాములు అన్యాక్రాంతం చేసి దర్జాగా అనుభవిస్తున్నారని మండిపడ్డారు. అసైన్మెంట్ భూములు, సీలింగు, గయ్యాల, ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అసైన్మెంట్ చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తీసుకువచ్చి ఈ భూములన్నీ భూస్వాములు కట్టబెట్టాలని ప్రయత్నిస్తుందని తెలిపారు. తోచలక రాయుడుపాలెం, ధర్మాజీగూడెం, సింగూడెం, బాధరాల, అయ్యప్పరాజు గూడెం, కలరాయనగూడెం తదితర గ్రామాలలో పేదల భూములు భూస్వాములు ఆక్రమించుకొని దర్జాగా అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములు పేదలకు చెందినవని, ఈ భూములను భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకొని భూమి లేని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు దుబ్బాక దాసు, పింగుల బాబురావు, లక్కపాము జ్యోతి, సుశీల, సంతోషం, వెంకటేశ్వర్లు, పండు, మండల నాయకులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న వ్యకాస నాయకులు

చంద్రయాన్-3 విజయవంతంపై హర్షం


జంగారెడ్డిగూడెం విద్యావికాస్‌లో వినూత్న ప్రదర్శన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చంద్రయాన్-3 విజయవంతంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన సిపిఐ బహిరంగసభ వేదికపై ఆయన మాట్లాడుతూ జాబిల్లిపై ఇప్పటి వరకూ ఏదేశం దిగని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ కాలు మోపడం సాంకేతిక పురోభివృద్ధి చెందటంలో అగ్రస్థానంలో దేశం ఉందని ఆనందం వ్యక్తం చేశారు. అంతరిక్షంలో భారత ప్రతిష్టను చాటి చెప్పిందన్నారు. ఇక నేటి నుంచి 14 రోజుల పాటు జాబిల్లిపై రోవర్ పరిశోధనలు జరపనుందన్నారు. సభలో వేదికపై ఆసీనులైన నాయకులు, హాజరైన ప్రజానీకం తమ చప్పట్ల ద్వారా హర్షం వ్యక్తం చేశారు.

విద్యావికాస్‌లో వినూత్న ప్రదర్శన

ఇస్రో ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ స్థానిక విద్యావికాస్ విద్యాసంస్థల విద్యార్థులు వినూత్న రీతిలో ప్రదర్శన చేశారు. బుధవారం విద్యా వికాస్ ప్రాంగణంలో విద్యార్థులు చంద్రయాన్-3 ఆకృతిలో మానవహారం నిర్మించి, వినూత్న ప్రదర్శనతో ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యావికాస్ విద్యాసంస్థల డైరెక్టర్ పి.సతీష్ చందు, కరస్పాండెంట్ వి.శ్రీనివాసరావులు మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతంతో భారత ఖ్యాతి పెరుగుతుందన్నారు. భారతీయ ఇస్రో శాస్త్రవేత్తలు గతంలో ఎన్నో అంతరిక్ష ప్రయోగాలను విజయవంతం చేసారని తెలిపారు. చంద్రయాన్-3 అంతరిక్ష ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ ఇస్రో శాస్త్రవేత్తలు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ప్రిన్సిపల్ ప్రసన్నలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చింతలపూడిలో టపాసులు కాల్చి హర్షం వ్యక్తం చేస్తున్న యువత

చింతలపూడి : చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలను చింతలపూడి పట్టణంలో యువకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్‌లో ఈ సందర్భంగా పెద్ద ఎత్తున టపాసులు కాల్చి, డాన్సులు వేస్తూ సంబరాలు చేసుకున్నారు. జయహో భారత్, అదిగదిగో చంద్రయాన్, ఇది ఇదిగో చంద్రయాన్, వందేమాతరం, గర్విద్దాం గర్విద్దాం - భారతీయుడిగా గర్విద్దాం, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో సిటిమెడికల్ దుర్గారావు పాల్గొన్నారు.


భీమడోలులో మానస ఇంగ్లీషు మీడియం విద్యార్థుల ర్యాలీ


బుట్టాయగూడెంలో విద్యార్థులకు స్వీట్స్ అందజేస్తున్న ఐటిడిఎ పిఒ సూర్యతేజ

పోలవరం : చంద్రయన్-3 విజయవంతమైనందున మండలంలోని విజ్ఞాన భారతి స్కూల్ సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన భారతి ప్రధానోపాధ్యాయులు నంగినిడి శివ, సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ కొమ్మిశెట్టి వెంకటేశ్వరావు, చింత యామినేశ్వరి, డి.శ్రీవిద్య, ఎడ్ల వెంకటలక్ష్మి, ఎస్‌కె రజియా, ఎస్‌కె శాలిని, డి.దుర్గా, టీచర్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏలూరుఅర్బన్ : చంద్రయాన్-3 విజయవంతమవ్వాలని స్థానిక పవర్‌పేటలో సదానంద స్పెషల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, సచివాలయం సిబ్బంది సామాజిక కార్యకర్తల సమక్షంలో బాల వికాస్ భారతి సంస్థ ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. చంద్రయాన్ ప్రయోగం జయప్రదం కావాలని, జయహో భారత్ అంటూ నినదించారు. బాల వికాస్ భారతి అధ్యక్షులు, న్యాయవాది శ్రీకట్టా సత్యనారాయణ సభకు అధ్యక్షత వహించగా, స్కూల్ హెడ్మాస్టర్ శ్రీడి.బాబు, మేతర అజయ్ బాబు, ఏలూరు సంస్థ అధ్యక్షులు, విభిన్న ప్రతిభావంతులు, శ్రీజాకోబ్ ఈ సమావేశానికి ముఖ్య ముఖ్యవక్తలుగా హాజరైయ్యారు. చంద్రయాన్-3 ప్రయోగం అవసరం, శాస్త్రవేత్తల కృషి, పిల్లలకు న్యాయవాది శ్రీకట్టా సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్ శ్రీమతి వి.రజిని, సచివాలయం ఉద్యోగస్తులు పాల్గొన్నారు. అనంతరం పిల్లలకు పౌష్టికాహారం అందజేశారు.


ఏలూరు అర్బన్‌లో విద్యార్థులు ప్రదర్శన

భీమడోలు : చంద్రయాన్-3 విజయవంతం కావాలని కోరుతూ భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో పాఠశాలకు చెందిన విద్యార్థులు, సిబ్బంది, అధ్యాపకులు భీమడోలు పురవీధులలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 30 అడుగుల ఎత్తు గల చంద్రయాన్-3 రాకెట్ నమూనాతో నిర్వహించిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. గాంధీ బొమ్మ సెంటర్‌లో అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంతరిక్ష ప్రయోగాలు, భారత్ ఖ్యాతి, చంద్రయాన్-3 ప్రాముఖ్యత గ్రామస్తులకు వివరిస్తూ ప్రిన్సిపల్ అవగాహన సదస్సు నిర్వహించారు.

బుట్టాయగూడెం : చంద్రయాన్-3 విక్రం లాండర్ షార్ట్ ల్యాండర్‌ని చంద్రుని దక్షిణ ధ్రువంపై దింపే కార్యక్రమాన్ని తిప్పలపాడు సమీపంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఐటిడిఎ పిఒ ఎం.సూర్య తేజ వీక్షించారు. అంతరిక్ష ప్రయోగాలు గురించి విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం చంద్రయాన్-3 ల్యాండింగ్ విజయవంతం కావడంతో విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ కెఆర్ పురం ఎపిఒ ఇంఛార్జి డిప్యూటీ డైరెక్టర్ పివిఎస్ నాయుడు, ఎటిడబ్ల్యూఒ శ్రీవిద్య పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి : మానవత

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణ పరిధిలో మానవత ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మానవత డైరెక్టర్ పి.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధి పేరిట భారీ వృక్షాలను నరికి వేస్తున్న తరుణంలో ఆక్సిజన్ నశించే ప్రమాదం ఉందన్నారు. అందుకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి, వాటిని సంరక్షించాలని సూచించారు.

చేబ్రోలు పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆశ నారాయణపురం-1 సచివాలయ పరిధిలోని ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం, చేబ్రోలు పిహెచ్‌సి యూఐపి కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చేబ్రోలు పిహెచ్ వైద్యాధికారి కె.సుబ్బరాజు వర్మ, శ్రావణ్ రెడ్డిలతో సమీక్షించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సిఆర్ రావు మృతికి సంతాపం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని పిజి సెంటర్‌లో ప్రొఫెసర్ సిఆర్ రావు మృతికి కృష్ణ యూనివర్సిటీ డాక్టర్ ఎంఆర్ అప్పారావు, పిజి సెంటర్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎంవి బసవేశ్వరరావు బుధవారం సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా సిఆర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ప్రిన్సిపల్ బసవేశ్వరరావు మాట్లాడుతూ సాటిస్టిక్స్ ప్రొఫెసర్‌గా ఎన్నో గొప్ప సేవలు అందించారని తెలిపారు. సిఆర్ రావు లేని లోటు ఎన్నటికీ తీరదని అన్నారు.

మృతుని కుటుంబానికి రూ.3 లక్షల సాయం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం సోషల్ మీడియా కోకన్వీనర్ అక్కా బత్తుల లక్ష్మణ్ ప్రమాదవశాత్తు చనిపోవడంతో ఆయన కుటుంబానికి రాష్ట్ర వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ సజ్జల భార్గవ్ రెడ్డి రూ.3లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు చొరవతో తాడేపల్లి ఆఫీసులో అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, ఏలూరు మైనార్టీ సెల్ సెక్రెటరీ ఎస్‌కె బాజీ, పోలవరం మండల సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయి రామకృష్ణ, వైసిపి యువ నాయకుడు పోడెం శ్యాంకుమార్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఉన్నిసాకు పలువురి అభినందన

ప్రజాశక్తి - పోలవరం

గూటాల-1 సచివాలయంలో సంక్షేమ, విద్యా సహాయకురాలుగా విధులు నిర్వహిస్తూ, ఉద్యోగరీత్యా ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో షేక్ మహబూబ్ ఉన్నిసా జిల్లా కలెక్టర్ సమక్షంలో అవార్డును అందుకున్నారు. షేక్ మహబూబ్ ఉన్నిసాను బుధవారం పోలవరం జడ్‌పిటిసి కలుం హేమ కుమారి, ఎంపిడిఒ జి.శ్రీను, సెక్రెటరీ విజయ కుమారి, సర్పంచి ప్రసాద్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జుడిషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్ వారి కోర్టులో

ఐ.ఎ. నం. 835/2022 ఇన్ ఐ.ఎ. నం. 438/2014 ఇన్ ఒ.యస్. నం. 69/2014

బిట్వీన్:
పెచ్చెట్టి నరసింహమూర్తి మరియు అనదర్
-పిటీషనర్స్/ పిటిషనర్లు
మరియు
1. పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ (డైడ్)
2. పెచ్చెట్టి శ్రీరామమూర్తి (డైడ్)
-రెస్పాండెంట్సు/ రెస్పాండెంట్లు

ప్రపోజుడు పార్టీలు:
3. పెచ్చెట్టి చంద్రకళ, భర్త: దొమ్మేటి నాగేశ్వరరావు, చుట్టుగుంట, విజయవాడ, 4. గంగా కళాజ్యోతి, భర్త: వినయ్, తండ్రి: పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ, చుట్టుగుంట, విజయవాడ. 5. పెచ్చెట్టి శ్రీనివాస్‌కుమార్, తండ్రి: వెంకట సత్యనారాయణ, మాచవరం డౌన్, చుట్టుగుంట, విజయవాడ. 6. పెచ్చెట్టి శ్రీ లక్ష్మి, తండ్రి: వెంకట సత్యనారాయణ, చుట్టుగుంట, విజయవాడ. 7. దొంగ మీనాక్షి, భర్త: శ్రీనివాసరావు, హౌసింగ్ బోర్డు కాలనీ, పాలకొల్లు.

పై నం. పిటిషన్లో రెస్పాండెంట్లు నం.లు 1, 2 చనిపోయినందున వారి వారసులైన 3 నుండి 7 వరకు రెస్పాండెంట్లు అయిన మిమ్ములను ఈ దావాలో చేర్చు నిమిత్తం మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికి తీసుకోకుండా కాలయాపన చేసినందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది. కాబట్టి ది. **1-9-2023 ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు వ్యక్తిగతంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. లేనిచో పై పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.

డి.సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, పాలకొల్లు
సెల్: 98491 73674
పాలకొల్లు
23-8-2023

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మరియు జుడిషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్ వారి కోర్టులో

ఐ.ఎ. నం. 832/2022 ఇన్ ఒ.యస్. నం. 69/2014

బిట్వీన్:
పెచ్చెట్టి నరసింహమూర్తి మరియు అనదర్
-పిటీషనర్స్/ వాదులు
మరియు
1. పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ (డైడ్)
2. పెచ్చెట్టి శ్రీరామమూర్తి (డైడ్)
-రెస్పాండెంట్సు/ ప్రతివాదులు

ప్రపోజుడు పార్టీలు:
3. పెచ్చెట్టి చంద్రకళ, భర్త: దొమ్మేటి నాగేశ్వరరావు, చుట్టుగుంట, విజయవాడ, 4. గంగా కళాజ్యోతి, భర్త: వినయ్, తండ్రి: పెచ్చెట్టి వెంకట సత్యనారాయణ, చుట్టుగుంట, విజయవాడ. 5. పెచ్చెట్టి శ్రీనివాస్‌కుమార్, తండ్రి: వెంకట సత్యనారాయణ, మాచవరం డౌన్, చుట్టుగుంట, విజయవాడ. 6. పెచ్చెట్టి శ్రీ లక్ష్మి, తండ్రి: వెంకట సత్యనారాయణ, చుట్టుగుంట, విజయవాడ. 7. దొంగ మీనాక్షి, భర్త: శ్రీనివాసరావు, హౌసింగ్ బోర్డు కాలనీ, పాలకొల్లు.

పై నం. దావాలో ప్రతివాదులు 1, 2 లు చనిపోయినందున వారి వారసులైన 3 నుండి 7 వరకు రెస్పాండెంట్లు అయిన మిమ్ములను ఈ పిటిషన్‌లో చేర్చు నిమిత్తం మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికి తీసుకోకుండా కాలయాపన చేసినందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయటమైనది. కాబట్టి ది. **1-9-2023 ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు వ్యక్తిగతంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన తెలియజేయవలసినదిగా కోరుచున్నాము. లేనిచో పై పిటిషన్ మీ పరోక్షముగా తీర్మానించబడును.

డి.సుబ్రహ్మణ్యం
అడ్వకేట్, పాలకొల్లు
సెల్: 98491 73674
పాలకొల్లు
23-8-2023

నేరాలు - ఘోరాలు

చేపల మేత లారీ బోల్తా

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని ముదినేపల్లి - బంటుమిల్లి రోడ్డులోని ఉప్పరగూడెం లారీ పల్టీ కొట్టింది. చేపల మేత లోడుతో లారీ మండలంలోని వైవాక చెరువు వద్దకు వెళుతుంది. ఈక్రమంలో ఉప్పరగూడెం వద్ద లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా లారీ అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.